క్లుప్తంగా

మహబూబ్ ఉస్సేని గ్యార్వి ఉత్సవాలు



అమరచింత: గ్యార్మి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో వెలసిన సయ్యద్ హజరత్ మహబూబ్ ఉస్సేని గ్యార్మి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్గా షరీఫ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు దర్గా వద్ద కందూర్ నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. ఉర్సోత్సవం సందర్భంగా దర్గా షరీఫ్‌కు మజీద్ కమిటీ ఆధ్వర్యంలో చాదర్‌ను సమర్పించారు. కార్యక్రమంలో ఖాజమైనోద్దీన్, రఫిక్, ఖాసీం, మైమూద్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



అమరచింత: డ్రీమ్ ఫౌండేషన్ ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఈనెల 21న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో అమరచింత విద్యార్థిని తస్లీమా బేగం పాల్గొని ఉమ్మడి జిల్లాలో మొదటి బహుమతి సాధించిందని జెడ్పీఉన్నత పాఠశాల హెచ్‌ఎం బలరాముడు తెలిపారు. విద్యార్థిని మొదటి బహుమతి సాధించి మెమెంటోతో పాటు ప్రశంసాపత్రం అందుకోవడం హర్షనీయం అన్నారు. త సందర్భంగా విద్యార్థిని శాలువా, పూలమాలతో శుక్రవారం ఘనంగా సన్మానించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



చిన్నంబావి: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం రావడంతో స్థానిక ఎంపీడీఓ రవి నారాయణ తన సిబ్బందితో వెళ్లి ఇంటి నిర్మాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూమిని వాడుకోవాలని, అలాంటి భూమిలో అక్రమ నిర్మాణం చేయడంతో తొలగించామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి నిర్మాణం చేపట్టాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు.

కొమరంభీమ్‌కు నివాళి



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణ వద్ద శుక్రవారం కొమరంభీం వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్ హాజరై గ్రామస్తులతో కలిసి పూలమాలలు వేసి కొమరంభీం గురించి వివరించారు. ఆదివాసీల హక్కుల కోసం నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించారన్నారు. గోండు జాతి ముద్దు బిడ్డగా ప్రజలు నేటికీ కొనియాడుతారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కొత్తకోట రూరల్: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. పట్టణ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, కేంద్ర బలగాలతో వాహనాల తనిఖీలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల్లో అక్రమంగా మద్యం తరలించినా, అనుమతి కంటే ఎక్కువగా డబ్బులు తీసుకెళ్లిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో బెల్ట్ షాపులు, దాబాల్లో మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దర్గాలో ప్రార్థనలు

పెబ్బేరు రూరల్: పట్టణంలోని స్థానిక నల్లచెరువు ట్యాంక్ బండ్ వద్ద నూతనంగా నిర్మించిన మహబూబ్‌సాని దర్గాలో మంత్రి నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మహ్మద్‌ఖాజ, చిన్నుమియ, నరేష్, పుట్టపాకల మహేష్, నీలస్వామి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. వదిలేశారు

- వీపనగండ్లలోని వివిధ కార్యాలయాల్లో నిరుపయోగంగా పరికరాలు
- తుప్పుపడుతున్న రూ.22 లక్షల వ్యవసాయ సామగ్రి
- నిరుపయోగంగా జనరేటర్



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తుప్పు పడుతున్న జనరేటర్



మహిళా సమైక్య కార్యాలయం వద్ద వృథాగా వ్యవసాయ పరికరాలు

వీపనగండ్ల: మండలంలో ప్రజలు, విద్యార్థులు, రైతుల బాగుకోసం రూ.లక్షలు వెచ్చించి ఉపయోగకరమైన పరికరాలను కొనుగోలు చేసిన ఉన్నతాధికారులు వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతుంది. మండల మహిళా సమైక్య ద్వారా ఐదేళ్ల క్రితం స్త్రీనిధి లోన్ ద్వారా రూ.22 లక్షలు ఖర్చు చేసి రెండు ట్రాక్టర్లు, నాగళ్లు, విత్తనపు గొర్రులు, రోటవేటర్లు, కిల్లర్లను కొనుగోలు చేశారు. వీటిని తక్కువ అద్దెతో రైతులకు అందజేస్తే ఉపయోగకరంగా ఉంటుందని భావించిన అధికారుల సమన్వయ లోపంతో లక్ష్యం నీరుగారుతోంది. దీంతో మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయం ఎదుట పరికరాలు తుప్పు పట్టి దర్శనం ఇస్తున్నాయి. స్త్రీనిధి రుణానికి నెలకు రూ.40 వేల కిస్తు జమ చేయాల్సి ఉంది. కానీ కిరాయి ఎక్కువ ఉండడంతో రైతులు వీటిని వినియోగించుకోవట్లేదు. దీంతో నెల కంతు చెల్లింపులో రూ.14 లక్షలు పెండింగ్ ఉందని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు.

గీజర్ వసతి లేక బాలికల ఇక్కట్లు

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో 207 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తుండగా వారి ఉపయోగార్థం వేడి నీటిని అందివ్వాలన్న సదుద్దేశ్యంతో ఆరేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి గీజర్ ట్యాంక్‌తో పాటు ఇతర పరికరాలు కొనుగోలు చేశారు. ఇప్పటికీ దీనిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారు.

వృథాగా జనరేటర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 15 ఏళ్ల క్రితం రూ.4 లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన జనరేటర్, కంప్యూటర్ పరికరాలు, ఫర్నీచర్ తదితర వస్తువులను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నేటికీ అవి వృథాగా పడి ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన అవసరం



ప్రజల సౌకర్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేసి సామగ్రి కొనుగోలు చేశారు. కానీ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడంతో అవి వృథాగా మారుతున్నాయి. అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న పరికరాలను వినియోగంలోకి తేవాలి.

– సాయిబాబా, రైతు, వీపనగండ్ల

ఆందోళన చేస్తాం



కొనుగోలు చేసిన వ్యవసాయ పరికరాలను తక్కువ అద్దెకు రైతులకు అందజేస్తే మేలు జరుగుతుంది. ఉన్నతాధికారుల సమన్వయ లోపం, అధిక రేట్ల వల్ల పరకరాలు తీసుకునేందుకు రైతులు ముందుకు రావడం లేదు. వీటిని వినియోగంలోకి తేకుంటే ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

– బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



వృథాగా పడి ఉన్న పరికరాల విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. తమ కార్యాలయ ఆవరణలో ఉన్న జనరేటర్, కంప్యూటర్ పరికరాలు తహసీల్దార్ కార్యాలయానికి చెందినవి.

– కతలప్ప, ఎంపీడీఓ, వీపనగండ్ల

వాల్మీకులు రాజకీయంగా ఎదగాలి



అభివాదం చేస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: వాల్మీకి బోయలు రాజకీయంగా ఎదగాలని, అందుకు ప్రతి గ్రామంలోని వాల్మీకులు ఐక్యంగా ఉండాలని వాల్మీకులు గొందు వెంకటరమణ, నారాయణ నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో జిల్లా వాల్మీకి బోయల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీల వారు వాల్మీకులను ఓటు వేసే యంత్రాలుగా చూస్తున్నారని వాపోయారు. ప్రతి సారి ఎన్నికల సమయంలో బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని మాయమాటలు చెప్పి తరువాత మా చేతుల్లో లేదని సాకులు చెప్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఇప్పటికైన వారి మాటలు నమ్మి మోసపోకుండా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మన జాతి నుంచి ఎవరూ వనపర్తి నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నా అందరం సహకరించాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



మదనాపురం ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు



నాచారంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆల మంజుల

కొత్తకోట రూరల్: దేవరకద్ర నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి ఓటు వేయాలని ఎమ్మెల్యే సతీమణి ఆల మంజుల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని నాచారంపేట, ఒట్లంపూడితండా, ఊరగట్టుతండా, జయరాంతండా, నాటవెల్లిపెద్దతండా, నాటవెల్లి గ్రామాల్లో తిరుగుతూ ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో దేవరకద్ర నియోజవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే దక్కిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడ లేనివిధంగా దేవరకద్ర నియోజవర్గంలో చెక్ డ్యాంల నిర్మాణంతో పాటు గ్రామాలకు బీటీ రోడ్లు, సీసీ రోడ్లు వేయించడంతో నూతన గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించారన్నారు. అంతకు ముందు నాచారంపేట సమీపంలో గల అబ్దుషాఖాదిరి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, సర్పంచ్‌లు చంద్రకళ, దేవి, ఎద్దుల లావణ్య, లక్ష్మణ్‌నాయక్, నిర్మల, గోపాల్‌నాయక్, ఎద్దుల నాగేష్, లక్ష్మణ్‌నాయక్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంతో పాటు దుప్పల్లి, దంతనూరు, కొత్తపల్లి, రామన్‌పాడు బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల్లో కొనసాగించారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం



నిల్వనీటిలో దోమల లార్వా నిర్మూలన మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మండలంలోని కేతేపల్లిలో పలు కాలనీల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, కీటక జనిత వ్యాధుల నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. వ్యాధులు సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. నిల్వ నీటిలో దోమల లార్వాను నిర్మూలించుటకు అబ్బేట్ ద్రావణాన్ని కలిపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమనశ్రీ, హెల్త్ అసిస్టెంట్లు రాంచందర్, సతీష్, శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలి



మొక్కలకు నీరు పడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బహదూర్‌గూడెంలో మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎండిన మొక్కల స్థానంలో నూతన మొక్కలు నాటాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో పాటు నర్సరీల్లో నూతన మొక్కల పెంపకానికి అవసరమగు మట్టిని సిద్ధం చేసి కవర్లలో నింపాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిత పాల్గొన్నారు.

విశ్వరూప రథయాత్రను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొత్తకోట: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత, విద్య, ఉద్యోగాల్లో న్యాయమైన వాటా, మాదిగ ఉపకులాల భవిష్యత్ కోసం మందకృష్ణ మాదిగ చేపట్టిన 'మాదిగల విశ్వరూప రథయాత్ర' ఈనెల 31న కొత్తకోటకు చేరుకుంటుందని జిల్లాలోని మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కొమ్ము ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు పిలుపునిచ్చారు. యాత్రకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా జిల్లాలోని మాదిగలు ప్రతి గ్రామం నుంచి వేలాదిగా కొత్తకోటకు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.ప్రశాంత్, బోయేజ్, ప్రేమదానం, మిషేక్, యేసు, భరత్‌భూషణ్, ఇజ్రాయిల్, ప్రసాద్, గట్టయ్య, రాజేష్, నాగరాజు, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: మండలంలోని యాపర్లకు చెందిన నాగపూర్ రాముడు ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు మేఘారెడ్డి సూచన మేరకు మండల నాయకులు గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నేతుల మన్యం, స్వరాజ్యంరెడ్డి, జింకల రవి, గుజ్జుల గోవిందు, బాలరాం, సూగూరు ఎల్లన్న, మాల కురుమూర్తి, ముంత వెంకట్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



ఆత్మకూర్‌లో..



దుప్పల్లిలో బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా వాకిటి శ్రీహరిని ప్రకటించడంతో పట్టణంలో పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి, మిఠాయిలను పంచిపెట్టి సంబరాలు జరుపుకొన్నారు. శుక్రవారం రాత్రి ఇందిరాగాంధీ చౌక్ నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలతో హోరెత్తించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి గెలుపు ఖాయమని, అభ్యర్థిని ఓట్ల రూపంలో ఓటర్లు ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీను, జిల్లాకార్యదర్శి రహ్మతుల్లా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఈర్లదిన్నె శ్రీను, జిల్లా నాయకులు షబ్బీర్, కలీం, గంగాధర్, అజ్మతుల్లా, మేస్త్రీ వెంకటన్న, వాహీద్ తదితరులు ఉన్నారు.

మదనాపురం: దేవరకద్ర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా జి మధుసూదన్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో శుక్రవారం రాత్రి మండలంలో కాంగ్రెస్ కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. దుప్పల్లితో పాటు మండలంలోని గ్రామాల్లో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు.

సోనియాగాంధీ మాటిస్తే తిరుగు ఉండదు



వనపర్తిలో మాట్లాడుతున్న పీవీ మోహన్



అమడబాకులలో ప్రచారం చేస్తున్న సత్యారెడ్డి

వనపర్తి టౌన్: నాగర్‌కర్నూల్‌లో వన్ డే మ్యాచ్, కొల్లాపూర్‌లో టెస్ట్ మ్యాచ్, వనపర్తిలో 20–20 మ్యాచ్ నడుస్తోందని ఒకే సిక్సర్‌తో కాంగ్రెస్ గెలుస్తుందని ఏఐసీసీ పరిశీలకుడు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ పీవీ మోహన్ అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన హామీలకు, ఇచ్చిన మాటకు ఎన్ని కష్టాలు వచ్చిన తిరుగు ఉండదని చెప్పారు. ఆంధ్రలో కాంగ్రెస్ బతకదని తెలిసినా ఇచ్చిన మాటకు, తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వడమే నిదర్శనమని పేర్కొన్నారు. నవంబర్ 1నుంచి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని 1936 బూత్ స్థాయిల్లో 2లక్షల మందికి పైగా ప్రజలను సమీకరించి ఈనెల 31న కొల్లాపూర్‌లో జరిగే ప్రియాంక గాంధీ సభకు తరలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వనపర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మంజుల, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వతాలు, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నంది మల్ల యాదయ్య, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, చీర్ల జనార్దన్, వెంకటేష్, జానకీరాములు, వెంకట్‌నారాయణ, గణేష్ గౌడ్, పెంటయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలంటూ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్యారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అమడబాకులలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ కార్డులో గల పథకాలు తప్పకుండా నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా గ్యారంటీ కార్డులో గల పథకాలు ఉన్నాయని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 2004లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేయడంతో పాటు రైతులకు ఉచితంగా కరెంటు ఇవ్వడం జరిగిందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి, బసిరెడ్డి, మోహన్‌గౌడ్, కిష్టారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, విజయరెడ్డి, తిరుపతయ్య, రాములు, చిన్ను, రామస్వామి, వెంకటయ్య, అబ్దుల్లా, ఇసూబ్‌ఖాన్, అన్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ బరిలో టీడీపీ అభ్యర్థి

వనపర్తి టౌన్: అసెంబ్లీ ఎన్నికల బరిలో వనపర్తి నుంచి టీడీపీ తరపున సైకిల్ గుర్తుపై అభ్యర్థి పోటీ చేయనున్నట్లు టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బి.రాములు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరినంత మాత్రాన టీడీపీ లేదని ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. తెలంగాణ టీడీపీ అధిష్ఠానానికి వనపర్తి నుంచి బరిలో నిలబడేందుకు టీడీపీ నాయకులు వెంకటయ్యయాదవ్, రామన్‌గౌడ్, అడ్వకేట్ మోహన్‌కుమార్ యాదవ్ పేర్లను పంపామని ముగ్గురిలో ఎవరికి టికెట్ వచ్చిన టీడీపీ సత్తా చూపిస్తామని చెప్పారు. త్వరలోనే వనపర్తిలో టీడీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య యాదవ్ ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ డీటీఎఫ్ సీఐ పరమేష్ గౌడ్ ఆధ్వర్యంలో మారేడుదిన్నె, యాపట్లతండా, పెద్దకొత్తపల్లి, సాతాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 1750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పరమేష్‌గౌడ్ తెలిపారు. అదేవిధంగా 405 లీటర్ల కల్లు, 170 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. దాడులలో ఎస్‌ఐ రవి, అరుణ పాల్గొన్నారు.

కార్మికుల మేనిఫెస్టో విడుదల చేయాలి



మాట్లాడుతున్న జయలక్ష్మి

పెబ్బేరు రూరల్: అన్ని రాజకీయ పార్టీలు కార్మికుల మేనిఫెస్టో విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ నాయకుడు ఎం రాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కార్మికుల మేనిఫెస్టో రాష్ట్ర, కేంద్ర కార్మిక సంఘాలు విడుదల చేశాయి. అన్ని రాజకీయ పార్టీలకు అధ్యక్షులకు ఈ మేనిఫెస్టో కాపీలను అందజేశామని తెలిపారు. జిల్లా కార్మికులకు అనుగుణంగా రాజకీయ పార్టీలు జిల్లా ప్రణాళికలు విడుదల జేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ సిబ్బందికి కనీస వేతనాలు ఇస్తూ వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, పింఛన్, గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంటు బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు ఇస్తూ మల్టీపర్పస్ వర్కర్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుట్ట ఆంజనేయులు, ఆర్‌ఎస్ రమేష్, ఎస్ రాము, గోపాలకృష్ణ, బుచ్చమ్మ, మదన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



ఆత్మకూర్‌లో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న డీఈఓ నరహరి



దొంతికుంటతండాలో ర్యాంపు ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా చేపడుతున్న నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని దొంతికుంటతండా, గట్టుకాడిపల్లి, కుంటముందలితండాల్లో పర్యటించి ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులు, పోలింగ్ కేంద్రాల్లో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలు, ర్యాంపుల ఏర్పాటు పనులను పరిశీలించారు. మొక్కలకు నీళ్లు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కోతులకుంటతండాలో మరుగుదొడ్డి పనులు, దొంతికుంటతండాలో కేంద్రం లోపలికికి వెళ్లే విధంగా ఏర్పాటు చేస్తున్న ర్యాంపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు.

ఆత్మకూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా విద్యాధికారి నరహరి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలకు తావివ్వకుండా పూర్తి ఏర్పాట్లను చేపట్టాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూతులు పరిశుభ్రంగా ఉండేవిధంగా పారిశుద్ధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం కొండాపురం బాలరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.